రక్తదానానికి ముందుకు రావాలి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 29 : ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానమని, ఆరోగ్యవంతులైన వ్యక్తులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కోరారు. వైద్య, ఆరోగ్య, పశు సంవర్ధక, రెడ్ క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుల, మత భేదం లేకుండా ఆరోగ్యవంతులైన వ్యక్తులు రక్తదానం చేయడంతో బలహీనులు కారని, గుండె జబ్బులు, క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటివి దరిచేరవని ఆరోగ్య సంస్థ తెలిపిందని అన్నారు. జిల్లాలో రక్తం నిల్వలు ఉంటే ప్రాణాలను కాపాడవచ్చని, అందుకే జిల్లాలో విస్తృతంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ శిబిరంలో 56 మంది పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గోపాల మిత్రలు 25 మంది, వైడ్ సిబ్బంది 12 మంది, రైతులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మణ్ సింగ్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహారావు, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న, కార్యదర్శులు రఘుకుమార్, వైద్యులు నర్సింహా, సంజయ్, శ్రీనివాస్, దేవేందర్, శ్రేష్ఠ, గోపాల మిత్రలు కృష్ణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

రాజంపేట్, ఏప్రిల్ 29 : మండలంలోని పొందుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సరైన మ్యాచర్ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశం

కామారెడ్డి, ఏప్రిల్ 29 : జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్.. భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడారు. తాగునీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, మరమ్మతులు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరాపై సమీక్షిస్తూ ఎస్సారెస్పీలో నీటి లభ్యత ఉన్నదని, సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా పైప్‌లైన్లలో లీకేజీ అరికట్టాలని సూచించారు. అవసరం మేర నూతన పైప్ లైన్లు, ట్యాంకుల నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లాలో ఎన్‌డీఎఫ్ కింద బోరుబావులు, పంపుసెట్లు, పైప్‌లైన్ల నిర్మాణంవంటివి 257 పనులు చేపట్టగా ఇప్పటికే 211 పనులు పూర్తిచేయడంతో ఇంజినీరింగ్ అధికారులను అభినందించారు. మిగతా పనులను కూడా మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద జిల్లాలోని వెయ్యి పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టడానికి రూ. 10 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్, డీఈవో రాజు, మిషన్ భగీరథ ఈఈ రమేశ్, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, ఏప్రిల్ 29 : తెలంగాణ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ బన్సీలాల్, ట్రెజరర్‌గా డాక్టర్ రాజుగౌడ్, జీసీ మెంబర్లుగా డాక్టర్ కిశోర్‌గౌడ్, డాక్టర్ వసంత్ కుమార్, డాక్టర్ మధుసూదన్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ జ్యోతి, డాక్టర్ కృష్ణ, డాక్టర్ రవీంద్రమోహన్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ గౌతమి, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కామారెడ్డి, ఏప్రిల్ 29 : కామారెడ్డి పెద్ద చెరువు కట్ట కింద ఉన్న ఒక వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 నుంచి 50 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తి బావిలో పడినట్లు ఆ వ్యవసాయ భూమిని కౌలు చేస్తున్న కొత్తూరు రాజశేఖర్ గమనించి పోలీసు వారికి సమాచారం ఇచ్చాడన్నారు. అక్కడికి వెళ్లి చూడగా వైట్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, గ్రీన్ కలర్ జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నాడని, ముస్లిం వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓటుతో తరిమి కొట్టండి

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, ఉపాధిహామీ కూలీలు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 29 : ఉత్తుత్తి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని, దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెట్టుతున్న బీజేపీని త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో తరిమి కొట్టాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా మండలంలోని రాంపూర్, పులికుచ్చతండా, రాంపూర్ తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశానికి వెళ్లి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ఎండగడుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే హనుమాన్ జయంతి నాటికి బాన్సువాడలో దేశంలోనే 108 అడుగుల హనుమంతుడి విగ్రహం కట్టిస్తానని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పని చేసిన సురేశ్ షెట్కార్, పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ ఎంపీగా పని చేసిన బీబీ పాటిల్ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు వస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ని గెలిపించాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలను ఇచ్చి, అధికారంలోకి రాగానే చేతులెత్తేసిందని విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమని, రైతులు ఆందోళన చెందకుండా ఆత్మహత్యలకు పాల్పడొద్దని భరోసా ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ దుద్దాల అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ హరిసింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, అంబర్‌సింగ్, మోహన్‌రెడ్డి, అజీం, అజీజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ

కామారెడ్డి, ఏప్రిల్ 29 : జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో 2024 వేసవి శిక్షణ శిబిరాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మే 1 నుంచి 31వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో 11 శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కామారెడ్డి, రామారెడ్డి, దోమకొండ, నాగిరెడ్డిపేట్, జుక్కల్, ఎల్లారెడ్డి, బీబీపేట్, తాడ్వాయి, బాన్సువాడ, గాంధారి మండలాల్లో ఈ క్రీడ క్యాంపులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 14 ఏండ్లలోపు ఆసక్తి ఉన్నవారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీశ్

కామారెడ్డి, ఏప్రిల్ 29 : కొత్తగూడెంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన అనుముల సతీశ్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గానికి, సహకరించిన వారిందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ టెన్త్ పరీక్షలు

బాన్సువాడ, ఏప్రిల్ 29 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఎంఈవో నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సీయూపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాల్లో 404 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 356 మంది రాశారు. 48 మంది విద్యార్థులు గైర్హాజయ్యారని ఎంఈవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి, ఏప్రిల్ 29 : మండలంలోని సర్దాపూర్‌తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నూనావత్ గంగారాం(45) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. వివరాల ఇలా ఉన్నాయి. బంజపల్లికి చెందిన అమర్‌సింగ్‌తో కలిసి గంగారాం బైక్‌పై మాచారెడ్డి నుంచి సర్దాపూర్‌తండాకు ఆదివారం రాత్రి వెళ్తున్నారు. రాజ్‌ఖాన్‌పేట గ్రామశివారులో అడవి పందులను బైక్ ఢీకొంది. తీవ్రగాయాలైన ఇద్దరిని కామారెడ్డికి తరలించారు. గంగారాంను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందూతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌కు సన్మానం

బీబీపేట్, ఏప్రిల్ 29 : మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డిని పలువురు నాయకులు సన్మానించారు. సోమవారం మండల కో-ఆప్షన్ సభ్యుడు ఆసీఫ్, మండల మైనార్టీ అధ్యక్షుడు బాబా ఫక్రొద్దీన్, సీనియర్ నాయకులు సయ్యద్ హుస్సేన్ ఖాజా మైనుద్దీన్ తదితరులు కలిసి ఘనంగా శాలువాతో సన్మానించారు.

కొడిచిరలో కొనసాగుతున్నసప్తాహం

సప్తాహంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మద్నూర్, ఏప్రిల్ 29: మండలంలోని కొడిచిర గ్రామంలో అఖండ హరినామ సప్తాహం కొనసాగుతున్నది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. వార్కారీలు చేసిన కీర్తనలు విన్నారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ..ప్రతి ఒక్కరికీ దైవచింతన అవసరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా షిండేను వార్కారీలు సన్మానించారు.

మోఘలో అన్నదానం

డోంగ్లీ, ఏప్రిల్ 29: మండలంలోని మోఘ గ్రామంలో అఖండ శివనామ సప్తాహం ముగింపు సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జహీరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరేద్దాం

మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కృష్ణాజివాడిలో ఎన్నికల ప్రచారం

కృష్ణాజివాడిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 29: జహీరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఇప్పటివరకు ఏ ఒక్కటి కూడా అమలుచేయడంలేదని మండిపడ్డారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. దేవుడిపేరు చెప్పుకొని ఓట్లు వేయించేకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ రెండు పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. దేశం మెచ్చేలా అద్భుత పథకాలు ప్రవేశపెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల మెప్పు పొందిందన్నారు. ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉండే బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో జడ్పీటీసీ రమాదేవీ నారాయణ, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్ కపిల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహులు, నాయకులు గోపాల్‌రావు, రాంరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మంగారెడ్డి, సాయిరెడ్డి, రాజాగౌడ్, రమేశ్‌రావు, భూపతి, ప్రభాకర్‌రావు, సాయిలు, రాజిరెడ్డి, గంగారాం, రాజేందర్‌రావ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

గాంధారి, ఏప్రిల్ 29: జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతానికి వెళ్లి కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలుచేసిన సంక్షేమ పథకాలను కూలీలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో మాజీ సర్పంచ్ పెద్దబూరి సత్యం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, మండల కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ ముస్తాఫా, మాజీ ఉప సర్పంచ్ కొమ్మల రామేశ్, జింగురు సురేశ్, పత్తి సాయులు, దొల్లు సాయిలు, తూర్పు సంతోష్, గౌస్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఉపాధి కూలీలకు అందుబాటులో ఫస్ట్ ఎయిడ్ కిట్స్

మత్తమాల పీహెచ్‌సీ నుంచి ఫస్ట్ ఎయిడ్ కిట్లను తీసుకుంటున్న ఎంపీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 29: ఉపాధికూలీల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు ఎంపీవో అతినారపు ప్రకాశ్ తెలిపారు. సోమవారం ఆయన ఎల్లారెడ్డి మండలం మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఫస్ట్ ఎయిడ్ కిట్లను తీసుకున్నారు. వాటిని గ్రామాల వారీగా ఉపాధిహామీ కూలీల కోసం పంపిణీ చేస్తామని చెప్పారు. కిట్‌లో అయోడిన్, స్పిరిట్, కాటన్, బ్యాండేజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంటాయని తెలిపారు. దవాఖాన డాక్టర్ శరత్‌కుమార్ ఏపీవో వినోద్‌కుమార్ తదితరులున్నారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి

బిచ్కుంద, ఏప్రిల్ 29: ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. వేసవికాలం కావడంతో పనిచేసే ప్రదేశంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు.

జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో -ఇన్‌చార్జిగా మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 29: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ కో-ఇన్‌చార్జిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఉత్తర్వులు జారీ చేశారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరి మృతి

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 29: మండలంలోని ఎల్గంటి చెరువు సమీపంలో 161 నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి చిన్న దేవాడా గ్రామానికి తల్లి కొడుకులైన యాది గొండ, అంజవ్వ బైక్‌పై వస్తున్నారు. మండలంలోని ఎల్గంటి చెరువు సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కిందిడిపోయింది. దీంతో తల్లి అంజవ్వ అక్కడికక్కడే మృతి చెందగా.. యాదిగొండకు స్వల్ప గాయలైనట్లు ఎస్సై తెలిపారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

రామారెడ్డి, ఏప్రిల్ 29: బతుకుదెరువు కోసం వచ్చిన ఓ యువకుడు స్కూల్‌తండా గ్రామ శివారులో రోడ్డుపక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రామారెడ్డి ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన తోకల త్రిమూర్తి (30) భార్యతో కలిసి నెలరోజుల క్రితం రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చాడు. ఈ నెల 28వ తేదీన ఇంటి నుంచి బయటికి రాత్రయినా తిరిగిరాలేదు. స్కూల్‌తండా గ్రామ శివారులో రోడ్డు పక్కన త్రిమూర్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న భార్య కుటుంబ సభ్యులతో అక్కడికి చేరుకొని బోరున విలపించింది. మృతుడి భార్య కోటేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్ర॥ ✆ 98482 68883
NTZ-324910

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మద్నూర్, ఏప్రిల్ 29: మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ కార్యదర్శి విఠల్ సోమవారం ప్రారంభించారు. క్వింటాలు జొన్నకు ప్రభుత్వం రూ.3180 మద్దతు ధర అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు పంటలనుకొనుగోలు కేంద్రానికి తీసుసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బాబురావు ఏఈవోలు అనిల్, సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

బిచ్కుంద, ఏప్రిల్ 29: మద్నూర్‌లోని ఓ హోటల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఆబ్కారి శాఖ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన యెంజప్‌వార్ సాహెబ్‌రావు తన హోటల్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో దాడిచేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 5.04లీటర్ల బీరుబాటిళ్లు, 4.55లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఆబ్కారి సీఐ సత్యనారాయణ తెలిపారు. దాడుల్లో ఆబ్కారి ఎస్సై నగేశ్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ప్రేమలత, ట్రైని కానిస్టేబుల్ దేవీసింగ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బిచ్కుంద, ఏప్రిల్ 29: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటివనరులపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో సోమవారం వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయగా.. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ పరిశీలించారు. వాటర్ ట్యాంకుల ఏర్పాటుపై కాలనీవాసులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది హన్మంత్ రావు తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధి హామీ కూలీలు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 29 : ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్ నాగరాజు పనితీరును నిరసిస్తూ బీర్కూర్‌లోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఉపాధి హామీ కూలీలు సోమవారం ముట్టడించారు. నాగరాజు పని స్థలం వద్ద తాగునీరు, టెంట్లు తదితర సదుపాయాలను కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేయని వారికి కూడా డబ్బులు ఇస్తున్నాడని ఆరోపించారు. సీనియర్ మేట్ నాగరాజును విధులు నుంచి తొలగించి కొత్త వారిని నియమించాలని డిమాండ్ చేశారు.